ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 31.5
కనిష్ఠం 24.6
ANDHRAJYOTHY

యాదాద్రి భువనగిరి
3
బుధవారం 18 సెప్టెంబరు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.90 (311.7462)	67,871	70,629
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644 (4.20)	382.28	629.46
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.17 (44.4)	51,030	51,030

చికెన్ ధరలు | లైవ్ : రూ.145 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250



జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

తిరుగుబాటు నేర్పిన.. సాయుధ పోరాటం

- రజాకార్ల దమనకాండను అణచివేసిన ప్రజాచైతన్యం
- తెలంగాణ ప్రజానీకానికి చేరువగా 'ప్రజాపాలన'
- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి
- వైభవంగా కలెక్టరేట్‌లో 'ప్రజాపాలన' దినోత్సవం

బండెనక బండి కట్టి పదహారు బండ్లు కట్టి.. ఏ బండ్లో వస్తవు కొడుకో.. నైజాం సర్కారోడా... అనే పాట స్ఫూర్తితో సాయుధ పోరాటంలో తెలంగాణ ప్రజలు తిరుగుబాటు చేశారని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో మంగళవారం 'ప్రజాపాలన' వేడుకలు వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానం భారత్ యూనియన్‌లో చేరి నేటికి 77వ వసంతంలోకి అడుగుపెట్టామన్నారు. నల్లగొండ జిల్లాకు చెందిన బండి యాదగిరి రాసిన ఈ పాటతో ప్రజల్లో చైతన్యం రగిలిందన్నారు. ప్రపంచ చరిత్రలో తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు.

- భువనగిరి అర్బన్

ఉద్యమాలకు ఉమ్మడి జిల్లా కేంద్ర బిందువు

భూస్వామ్య, పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో నల్లగొండలోని గుండ్రాంపల్లి, కడవెండి, రావులపెంట ప్రాంతాలు ఉద్యమానికి కేంద్రబిందువుగా మారాయని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ సంస్థానం స్వతంత్రంగా ఉంటుందని నైజాం రాజు ప్రకటించినప్పటికీ భూస్వాములు, జమీందార్లు, జాగీర్‌దార్లు, దేశ్‌ముఖ్‌ల వద్దే అధికంగా భూమి ఉండిపోయిందన్నారు. అందుకే రైతులు కౌలు కింద పండించిన పంటలో అగ్రభాగం వారికే చెల్లించాల్సి వచ్చిందని, అదేవిధంగా 85శాతం స్థానిక భాషపై కూడా పెత్తనం పెరిగిందన్నారు. వెట్టిచాకిరి, బానిసత్వం కొనసాగుతుండగా ప్రైవేట్ సైన్యంతో రజాకార్లు తెలంగాణ ప్రజానీకంపై దమనకాండ కొనసాగించిందన్నారు. కనీస హక్కులు, దోపిడీ, దౌర్జన్యాలపై తిరుగుబాటును చైతన్య పర్చేందుకు కొమర్రాజు లక్ష్మణరావు 1901లో మునగాల రాజా నాయని వెంకటరంగారావు సహాయంతో శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయాన్ని నెలకొల్పి మొట్టమొదటి గ్రంథాలయ ఉద్యమానికి నాంది పలికారన్నారు. 1904లో లక్ష్మణ్‌రావు హన్మకొండలో రాజరాజ నరేంద్ర భాషా నిలయం, 1905లో సికింద్రాబాద్‌లో ఆంగ్ల సంవర్ధిని నిలయం వెలిశాయన్నారు. అప్పటినుంచి ప్రతి ఏటా జరిగిన గ్రంథాలయ మహాసభలు తెలుగు ప్రజలను ఏకం చేశాయన్నారు. 1930లో జోగిపేటలో సురవరం ప్రతాప్‌రెడ్డి అధ్యతన ఆంధ్ర జన కేంద్ర సభ ఆంధ్రమహాసభగా మారిందన్నారు. 1946 వరకు 13 ఆంధ్రమహాసభలు జరిగి తెలంగాణ జాతీయోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించాయన్నారు. 1931లో దేవరకొండలో రెండు ఆంధ్రమహాసభలు జరగగా, 1944లో జరిగిన 11వ మహాసభలో రావి నారాయణరెడ్డి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని చెప్పారు.

పత్రికల పాత్ర కీలకం

సాయుధ పోరాట సమయంలో గోల్కొండ, నీలగిరి, తెలుగు పత్రికలతోపాటు ఇతర పత్రికలు ప్రజల్ని చైతన్యపర్చేందుకు ముఖ్యపాత్ర పోషించాయని సుఖేందర్‌రెడ్డి అన్నారు. రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఈ మహాసభ ద్వారా మగ్దుం మొహినొద్దిన్, రాజా బహదూర్, రామానందతీర్థ, మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, కొండ వెంకటరంగారెడ్డి, రావి నారాయణరెడ్డి, దేవులపల్లి రామానుజరావు, కేఎల్ మహేంద్ర, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి హైదరాబాద్ సంస్థాన ప్రజలను చైతన్యపర్చారన్నారు. అప్పట్లో జరిగిన తెలంగాణ ప్రజాపోరాటంలో ఉమ్మడి నల్లగొండ నుంచి రావి నారాయణరెడ్డి, బీంరెడ్డి నర్సింహారెడ్డి, బొమ్మగాని ధర్మబిక్షం, ఆరుట్ల రామచంద్రారెడ్డి, కమలమ్మ, బద్దం ఎల్లారెడ్డి, రామచంద్రారెడితోపాటు మరికొందరు త్యాగధనులు స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రభావితం చేశారన్నారు. ఈ పోరాటంలో తొలి అమరుడైన దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమం తీవ్రతరమైందన్నారు. 1947 ఆగస్టు 15న దేశం స్వాతంత్ర్య సంబురాల్లో మునిగి ఉంటే హైదరాబాద్ సంస్థాన ప్రజలు మాత్రం ఇంకా స్వేచ్ఛా, స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి పరాకాష్టగా 1948 ఆగస్టు 27న జరిగిన బైరాన్‌పల్లి కాల్పుల ఘటన మరపురానిదన్నారు. అప్పటినుంచి 21 రోజుల్లోనే హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్ చేరిందన్నారు. భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, హోంమంత్రి సర్దార్ వల్లాభాయ్ పటేల్ చొరవతో 'ఆపరేషన్ పోలో' పేరుతో భారత ప్రభుత్వం ఒత్తిడితో 1948 సెప్టెంబరు 17న సాయంత్రం డెక్కన్ రేడియోలో ఇండియన్ యూనియన్‌కు నైజాం సర్కార్ లొంగిపోయిందన్నారు. 1948 సంవత్సరం వరకు మేజర్ జనరల్ జేఎన్ చౌదరి మిలటరీ గవర్నర్‌గా 1950 నుంచి 1952 వరకు ఎం.కే వెల్లోడి (ఐఏఎస్)ని ముఖ్యమంత్రి (సివిల్ అడ్మినిస్ట్రేటర్)గా కేంద్రం నియమించగా పరిపాలన కొనసాగిందన్నారు. అప్పట్లో ఎంతగా వ్యతిరేకించినప్పటికీ భాషాప్రయుక్త రాష్ట్రాల పేరుతో 1956లో ఆంధ్రప్రదేశ్‌గా అవతరించిందన్నారు. కాలక్రమేణ ఆంధ్ర పాలకులకు వ్యతిరేకంగా 1969లో తెలంగాణోద్యమం ప్రారంభమైందన్నారు. తొలి దశ పోరాటంలో 350మంది, మలిదశలో 1,100మంది తెలంగాణ ఉద్యమంలో అమరులయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. సుదీర్ఘకాలం సాగిన ప్రాణత్యాగాలు, పోరాటాలతో 2014 జూన్ 2న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అవతరించిందన్నారు.


అమరులకు నివాళి

ఆరు గ్యారంటీల అమలు కోసం

ప్రభుత్వం ప్రకటించిన అభయహస్తం ఆరు గ్యారంటీల పథకాలకోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు 'ప్రజాపాలన' కార్యక్రమం చేపట్టిందని సుఖేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2023 డిసెంబరు 28 నుంచి 2024 జనవరి 1వ తేదీ వరకు గ్రామ సభలు చేపట్టి 2,68,790 దరఖాస్తులు స్వీకరించి కంప్యూటరీకరణ చేయగా, 26 ప్రజాపాలన కేంద్రాల ద్వారా జిల్లాలో 26,00,191 దరఖాస్తుల వివరాలు సరిచేశారని తెలిపారు. జిల్లాలో 2023 డిసెంబరు 9 నుంచి నేటి వరకు ఆర్టీసీ బస్సుల్లో 68,80,206 మహిళ ప్రయాణికులకు రూ.36.89కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందన్నారు. అదేవిధంగా మహిళా సాధికారతకోసం రూ.500కే సబ్సిడీ గ్యాస్ అందజేసి జిల్లావ్యాప్తంగా 1,18,158మందిని అర్హులుగా తేల్చిన ప్రభుత్వం ఇందుకోసం 2,87,133 గ్యాస్ సిలిండర్లు అందజేసి రూ.8.88కోట్లు లబ్ధిదారులకు అందాల్సిన సబ్సిడీని వారి ఖాతాల్లో జమ చేసిందన్నారు. అదే విధంగా గృహాజ్యోతి పథకంలో భాగంగా రూ. 28.35కోట్ల విలువైన విద్యుత్‌ను 1,42,205మంది వినియోగదారులకు మార్చి 2024 సంవత్సరం నుంచి జీరో బిల్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతు పంట రుణమాఫీ 2024 ప్రకారం మొదటి దఫాలో రూ. లక్షలోపు వరకు రుణం పొందిన 32,693 మంది రైతులకు రూ. 178.42కోట్లు, రెండో దఫాలో రూ.లక్షనుంచి రూ.1.50లక్షల వరకు 17,991మందికి గాను రూ. 176.12కోట్లు, మూడో విడతలో రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షల వరకు 11,495మందికి రూ. 145.46కోట్ల రుణమాఫీచేసి ప్రభుత్వం చేసిన వాగ్దానం నిలబెట్టుకుందన్నారు. కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి, తుంగతుర్తి ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేల్, కలెక్టర్ హనుమంతు కే.జెండగే, భువనగిరి జోన్ డీసీపీ ఎం.రాజేష్‌చంద్ర, అదనపు కలెక్టర్లు పి.బెన్‌షాలోమ్, కే.గంగాధర్, భువనగిరి మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన..

ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భువనగిరి, బొమ్మలరామారం, తుర్కపల్లి కేజీబీవీ, భువనగిరి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థినులు బోనాలు, పోతరాజుల వేషధారణ, పీర్ల ప్రదర్శన చేశారు. అదేవిధంగా కలెక్టరేట్ భవన సముదాయంపై, ప్రవేశద్వారం వద్ద సబ్సిడీ గ్యాస్ సిలిండర్ బెలూన్లను అధికారులు ఏర్పాటు చేశారు. తొలుత పోలీసుల గౌరవ వందనాన్ని గుత్తా సుఖేందర్‌రెడ్డి స్వీకరించారు.




మెరుగైన పారిశుధ్యంతోనే
స్వచ్ఛ గ్రామాలు

కలెక్టర్ హనుమంతు కే.జెండగే


తుక్కాపురంలో పారిశుధ్య కార్మికురాలిని సన్మానిస్తున్న కలెక్టర్, డీపీవో, తదితరులు

భువనగిరి రూరల్, సెప్టెంబరు 17: మెరుగైన పారిశుధ్యంతోనే స్వచ్ఛ గ్రామాలుగా రూపుదిద్దుకుంటాయని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. 'స్వచ్ఛతాహీ' సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం భువనగిరి మండలం తుక్కాపురం గ్రామంలో ఆయన పర్యటించి మొక్క నాటి పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 17 నుంచి అక్టోబరు 2వరకు పక్షం రోజుల పాటు జిల్లా అంతటా 'స్వచ్ఛతాహీ సేవా' కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజలను స్వచ్ఛత వైపు నడిపించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు తదితర ప్రాంతాల్లో చెత్తాచెదారం లేకుండా చేయడం, మురుగు కాల్వలో పూడిక తీత చేపట్టడం, కంపోస్టు యార్డుల్లో తడిపొడి చెత్త వేరుచేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం, నిరోధించడం తదితర కార్యక్రమాలు వీటిలో భాగమేనన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ చిత్రలేఖన పోటీలు నిర్వహించాలని, పబ్లిక్ స్థలాల్లో గోడలపై పారిశుధ్య అవగాహనపై పెయింటింగ్స్, స్వయం సహాయక మహిళా సంఘాల తోడ్పాటుతో ప్రజల భాగస్వామ్యంతో శ్రమదానం నిర్వహించాలన్నారు. పారిశుధ్య కార్మికులకు, సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ముఖ్యమన్నారు. అవసరమైన చోట ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని, ప్రతీ ఇంటికి మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. అంతకుముందు గ్రామంలో 'స్వచ్ఛతాహీ' సేవా ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో డీపీవో ఆర్.సునంద, జడ్పీ సీఈవో ఎన్.శోభారాణి, డీఆర్‌డీవో టి.నాగిరెడ్డి, అదనపు డీఆర్‌డీవో సురేశ్, ఎంపీడీవో చిల్కూరి శ్రీనివాస్, ఎంపీవో ఎం.దినకర్, ప్రత్యేక అధికారి అంబికా, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలి

ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా రూపొందించి అర్హులకు ఓటు హక్కు కల్పించాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే సూచించారు. మంగళవారం భువనగిరి మండలం అనాజీపురంలో ఇంటింటి ఓటరు జాబితా నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.అంజిరెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి


నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

మోత్కూరు, సెప్టెంబరు 17: గురుకుల పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పలువురు ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. మంగళవారం మోత్కూరు బాలుర గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు నల్లబాడ్జీలు ధరించి పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పార్ట్‌టైం టీచర్లకు మూడు మాసాలుగా, రెగ్యులర్ టీచర్లకు ఆగస్టు నెల వేతనం నేటికీ చెల్లించలేదన్నారు. తమకు అశాస్త్రీయ టైంటేబుల్‌తో పాటు కేర్‌టేకర్ బాధ్యతలు అప్పగిస్తున్నారన్నారు. బోధన కంటే బోధనేతర బాధ్యతలే ఎక్కువగా అప్పగిస్తున్నారన్నారు. సమస్యల పరిష్కారానికి గురుకుల సంఘాల జేఏసీ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన దశలవారీ పోరాట కార్యక్రమంలో భాగంగా ఈ నెల 28న నిర్వహించనున్న మహా ధర్నాలో ఉపాధ్యాయులంతా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేష్, మధుసూదన్, క్రాంతి, నర్సింహ, వెంకన్న సరిత పాల్గొన్నారు.

వంట నూనెల ధరల మంట

- దిగుమతి సుంకం పెంపుతో ధరలకు రెక్కలు
- ఒక్కో ప్యాకెట్‌పై రూ.15 నుంచి రూ.20 పెంపు
- పండుగల వేళ ప్రజలపై పెనుభారం

పండుగల వేళ సామాన్యుడి నెత్తిన మరో పిడుగు పడినట్లయింది. వంట నూనెల ధరలు కాకపుట్టిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని పెంచడంతో మార్కెట్లో నూనెల ధరలకు రెక్కలొచ్చాయి. ఒక్కో నూనె ప్యాకెట్‌పై రూ.15 నుంచి రూ.20 వరకు పెంచి విక్రయిస్తున్నారు. కాగా, రోజు రోజుకూ నూనెల దందా జోరుగా సాగుతుండటంతో ప్రజల ఆరోగ్యం గాలిలో దీపంలా మారుతోంది.

- భూదాన్‌పోచంపల్లి



కేంద్ర ప్రభుత్వం వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని (ఇంపోర్ట్ డ్యూటీ) పెంచుతున్నట్టు ప్రకటించడంతో మార్కెట్లో ఒక్కసారిగా ధరలు పెరిగాయి. అన్ని రకాల నూనెల ధరలు లీటర్‌పై ఒక్కసారిగా రూ.15నుంచి రూ.20వరకు పెరిగాయి. పామాయిల్ రూ.100 నుంచి రూ.115, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.115నుంచి రూ.130-140,వేరుశనగ నూనె రూ. 155నుంచి రూ.165కు చేరింది. రూ.170 ఉన్న మంచి పల్లీ నూనె రూ.220 వరకు పెరిగింది. పూజలకు ఉపయోగించే నూనెలనూ రూ.110 నుంచి రూ.120కి పెంచి వ్యాపారులు విక్రయిస్తున్నారు. పండుగలు మొదలైన తరుణంలో నూనె ధరలు పెంచడంపై వినియోగదారులు భగ్గుమంటున్నారు.

జోరుగా కల్తీ నూనెల దందా

మార్కెట్లో కల్తీ నూనెల దందా జోరుగా సాగుతోంది. వేరుశనగ గింజలు కొని గానుగాడిస్తే లీటర్ పల్లీనూనె ధర రూ.300పై చిలుకు పడుతోంది. కానీ, మార్కెట్లో వేరుశనగ నూనె పేరుతో రూ.210కే విక్రయిస్తున్నారు. అంటే దానిలో కల్తీ ఉన్నట్టేనని వినియోగదారులు పేర్కొంటున్నారు. పొద్దు తిరుగుడు నూనె విషయంలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఇక రూ.100కు లీటర్ చొప్పున విక్రయిస్తున్న నూనెలు దేని నుంచి తయారవుతున్నాయో తెలియదని వినియోగదారులు వాపోతున్నారు. ఇష్టమొచ్చిన కల్తీ నూనెలు వాడకం వల్ల పలు అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నూనె గింజల సాగు నానాటికీ తగ్గిపోతోంది. వాటికి మద్దతు ప్రకటించి మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసి పౌరసరఫరాలశాఖ, రేషన్ దుకాణాల ద్వారా వంట నూనెలు సరసమైన ధరలకు పంపిణీ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఏం కొనేట్టు లేదు



వంట నూనె ధరలు అకస్మాత్తుగా పెంచేశారు. పండుగ పూట పిండి వంటలు చేసుకునే వేళ ఇలా ధరలు పెంచడం తగదు. ఒకేసారి లీటర్ నూనెకు రూ.20 పెంచడం దారుణం. కేంద్ర ప్రభుత్వం నూనెలపై పెంచిన ధరలు వెంటనే తగ్గించాలి.

- యాదమ్మ, గృహిణి, భూదాన్‌పోచంపల్లి

అనువుగా సర్వీస్ రోడ్డు కాల్వ డిజైన్ చేయాలి

మునిసిపల్ చైర్మన్ రాజు


ఊర చెరువు వద్ద అధికారులతో మాట్లాడుతున్న చైర్మన్ రాజు

చౌటుప్పల్‌టౌన్, సెప్టెంబరు 17: పట్టణంలోని ఊర చెరువు అలుగు నీరు దిగువకు సులువుగా వెళ్లేలా హైవే సర్వీస్ రోడ్డు కాల్వ డిజైన్ చేయాలని మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు హైవే అధికారులకు సూచించారు. ఎన్‌హెచ్‌ఏఐ సాంకేతిక టీం నిపుణులు రాధేశ్యామ్, రవిరాజ్‌తో మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్ రాజు మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. చెరువు అలుగు నీటి కాలువపై సమీక్షించి చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రస్తుతం హైవే సర్వీస్ రోడ్డులో నిర్మిస్తున్న కాల్వ డిజైన్‌లో రెండు మీటర్ల వెడల్పు, 1.50 మీటర్ల లోతు ఉందని, ఈ కాల్వ నిర్మాణం వరద నీటి ప్రవాహానికి ఎంత మాత్రం సరిపడదని అన్నారు. చెరువులోకి చేరుకునే వరద నీటితో పాటు అలుగు నీటి ప్రవాహాన్ని పరిగణనలోకి తీసుకొని హైవే సర్వీస్ రోడ్డులో కాల్వను డిజైన్ చేయాలని కోరారు. ప్రస్తుతం నిర్మిస్తున్న కాల్వ డిజైన్‌ను మార్చాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో భారీ వర్షాలు కురిసినప్పుడు వచ్చిన వరదలతో పట్టణంలో నెలకొన్న పరిస్థితిని వివరించారు. హైవేకు ఉత్తర భాగంలో కొత్తగా డిజైన్‌ను చేసేంత వరకు కాల్వ నిర్మాణాన్ని నిలిపివేయాలని, అప్పటి వరకు దక్షిణ భాగంలోని సర్వీస్ రోడ్డులో కాల్వను నిర్మించాలని సూచించారు. అలుగు నీటి కాల్వ సమస్యను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సూచనల మేరకు హైవే అధికారులతో చర్చిస్తున్నట్టు తెలపగా, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎన్‌హెచ్‌ఏఐ సాంకేతిక నిపుణులు తెలిపారు. సమీక్షలో మునిసిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్‌లు ఎండీ.బాబా షరీఫ్, పి.శ్రీధర్‌బాబు, బొడిగే అరుణ, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి


చెరువును పరిశీలిస్తున్న డీసీపీ రాజేష్‌చంద్ర

చౌటుప్పల్ రూరల్ సెప్టెంబరు 17: వినాయక విగ్రహాల నిమజ్జనం పూర్తయ్యేవరకు పోలీసులు,ఇతర శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీసీపీ రాజేష్‌చంద్ర అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దండుమల్కాపురం చెరువును, నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. చెరువులో సుమారు 50 విగ్రహాల నిమజ్జనం చేశారని సిబ్బంది వివరించారు. మరో రెండు రోజులపాటు విగ్రహాల నిమజ్జనం ఉంటుందని తెలిపారు. అయితే విగ్రహాల నిమజ్జనం పూర్తయ్యేవరకు పోలీసులు పర్యవేక్షించాలని డీసీపీ సూచించారు. ఆయన వెంట ఏసీపీ మధుసూదర్శన్‌రెడ్డి, సీఐ మన్మథకుమార్ ఉన్నారు.


గణేష్ నిమజ్జనోత్సవంలో అపశ్రుతి

- చెరువులో పడి యువకుడి మృతి
- భూదాన్‌పోచంపల్లి మండలంలో విషాదం

•5లో..

పోలీసులకు పట్టుబడిన గంజాయి విక్రేత

మిలాద్ ఉన్ నబి వేడుకలు


విద్యుత్ దీపాల అలంకరణలో జలీల్‌పుర మజీద్

భువనగిరి టౌన్, సెప్టెంబరు 17: మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకొని భువనగిరిలోని జలీల్‌పుర మసీద్ కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు మిలాద్ ఉన్ నబి వేడుకలు నిర్వహించనున్నారు. బుధవారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు, గురువారం భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. అందుకోసం నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. మసీదును విద్యుత్ దీపాలతో అలంకరించారు. మిలాద్ ఉన్ నబి వేడుకలను విజయవంతం చేయాలని మసీదు కమిటీ అధ్యక్షుడు ఇక్బాల్ చౌదరి పిలుపునిచ్చారు.

అగ్ని ప్రమాదంలో రూ.3లక్షల ఆస్తి నష్టం

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబర్ 17: విద్యుదాఘాతంతో జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలో మంగళవారం ఈ ఘటన జరిగింది. స్థానికులు, బాధితుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఇరిగి మరియమ్మ తన భర్త కాశయ్య చనిపోవడంతో పదేళ్లుగా మూడు గేదెలను పెంచుకుంటూ జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో తనకున్న గేదెలను మేపడానికి సమీపంలోని పొలాల వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో సాయంత్రం సుమారు 5గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇంట్లోని సామగ్రి అంతా దగ్ధమైంది. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను ఆర్పి వేశారు. ఆర్ఐ లక్ష్మీకాంత్, పంచాయతీ కార్యదర్శి బుర్రి శ్రీనివాస్‌లు పంచనామా నిర్వహించారు. సుమారు రూ.3లక్షల మేర ఆస్తినష్టం జరిగిందని, తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితురాలు వేడుకుంది.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

● యాదగిరీశుడి సన్నిధిలో శాస్త్రోక్తంగా నిత్యపూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 17: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు అంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్యపూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి వేదమంత్రాలతో పంచామృతాభిషేకం జరిపిన అర్చకులు సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు చేశారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణ పర్వాలను పాంచరాత్రాగమశాస్త్రరీతిలో నిర్వహించారు. పాతగుట్ట ఆలయం, విష్ణుపుష్కరిణి, శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేక పూజలు చేయగా శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటికమూర్తులకు నిత్యపూజలు, నిత్య రుద్రహవనం శైవగామ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.23,25,994 ఆదాయం రాగా లీజుల ద్వారా రూ.2,78,947 సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, కొండపైన జాతీయ జెండా ఆవిష్కరణ డీఈవో దోర్బల భాస్కర్‌శర్మతో కలిసి ఆలయ ఈవో ఏపూరి భాస్కర్‌రావు చేశారు. అంతకు ముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ప్రత్యేకపూజలు చేశారు.

నల్లగొండ - భువనగిరి మధ్య సెమీ డీలక్స్ బస్సులు

నల్లగొండ, సెప్టెంబరు 17: ప్రయాణికుల సౌకర్యార్థం నల్లగొండ-భువనగిరి మధ్య సెమీ డీలక్స్ బస్సులను ప్రారంభించినట్లు రీజనల్ మేనేజర్ ఎం.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ నుంచి చిట్యాల, వలిగొండ మీదుగా భువనగిరికి ఈ సెమీ డీలక్స్ బస్సులు నడుస్తాయన్నారు. నల్లగొండ నుంచి భువనగిరి వరకు ఎక్స్‌ప్రెస్ చార్జి రూ.100, సెమీ డీలక్స్ బస్సుల్లో రూ.110 చార్జీలు ఉంటాయన్నారు. సెమీ డీలక్స్ బస్సుల్లో మహాలక్ష్మి పథకం వర్తించదని తెలిపారు.

జీ.ఎడవల్లి కొత్త చెరువుకు గండ్లు

● చెరువు నీరు వృథా... గండ్లు పూడ్చాలంటున్నరైతులు

కనగల్, సెప్టెంబరు 17: నల్లగొండ జిల్లా కనగల్ మండంలోని జీఎడవల్లి గ్రామ కొత్తచెరువు అలుగుకు పలుచోట్ల గండ్లుపడ్డాయి. దీంతో చెరువులోని నీరంతా దిగువకు వృథాగా పోతోంది. చెరువుకు గతేడాది ఇదే చోట గండ్లుపడగా రైతులు తాత్కాలికంగా మరమ్మతులు చేసి గండ్లను పూడ్చి వేశారు. అయితే అలుగు కట్ట బలహీనంగా ఉండటంతో అక్కడే మళ్లీ గండ్లు ఏర్పడ్డాయని రైతులు వాపోయారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి గండ్లను తక్షణమే పూడ్చివేసి నీటి వృథాను అడ్డుకోవాలని కోరుతున్నారు. చెరువు విస్తీర్ణం సుమారు 400 ఎకరాలుండగా, అదేస్థాయిలో ఆయకట్టు విస్తీర్ణం ఉందని రైతులు వివరించారు.


చెరువుకు గండి పడిన ప్రాంతం

అంతర్జాతీయ ఫెన్సింగ్ క్రీడలో ప్రతిభ

● అంతర్జాతీయ 24వ స్థానంలో నిలిచిన బంగారిగడ్డవాసి

చండూరు రూరల్, సెప్టెంబరు 17: నల్లగొండ జిల్లా చండూరు మండలం బంగారిగడ్డ గ్రామానికి చెందిన షేక్ ఫౌజియా అంతర్జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ 24వ స్థానంలో నిలిచింది. ఈ నెల 14, 15 తేదీల్లో న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన పోటీల్లో భారతదేశం తరఫున తలపడి 24వ స్థానంలో నిలిచింది. ఫోయిల్ ఉమెన్స్ సాటిలైట్ టోర్నీలో పాల్గొన్న ఫౌజియా ప్రస్తుతం వరంగల్‌లో సివిల్ కానిస్టేబుల్‌గా శిక్షణ పొందుతున్నారు. తనకు ఇంతటి సహాయ సహకారాలు అందించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.


షేక్ ఫౌజియా

యర్రవరం పీఏసీఎస్ కార్యదర్శి సస్పెండ్

కోదాడ రూరల్, సెప్టెంబర్ 17: సూర్యాపేట జిల్లా కోదాడ మండలం యర్రవరం సింగిల్ విండో సహకార పరపతి సంఘం కార్యదర్శి హుస్సేన్, కంప్యూటర్ ఆపరేటర్ పాముల వెంకటేశ్వర్లును సస్పెండ్ చేస్తూ మంగళవారం సంఘం తీర్మానించింది. ఇందుకు సంబంధించిన తీర్మాణ కాపీని జిల్లా సహకార అధికారికి పంపినట్లు చైర్మన్ నలజాల శ్రీనివాస్ తెలిపారు. ఆయన అధ్యక్షతన జరిగిన సహకార పరపతి సంఘ సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ రుణమాఫీని రైతులకువర్తింపజేయడంలో సంఘ కార్యదర్శి, కంప్యూటర్ ఆపరేటర్లు నిర్లక్ష్యం వహించినందుకు సంఘంలో 66 మంది రైతులకు రూ.30లక్షల రుణమాఫీ వర్తించకుండా పోయిందన్నారు. ఈ విషయంపై రైతులు సంఘం చైర్మన్, జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేశారన్నారు. రైతుల ఫిర్యాదు మేరకు జిల్లా సహకార అధికారి విచారణకు ఆదేశించారన్నారు. విచారణ జరిపిన అధికారులు సంఘం కార్యదర్శి హుస్సేన్, కంప్యూటర్ ఆపరేటర్ వెంకటేశ్వర్లు రుణమాఫీకోసం రైతుల జాబితాను ప్రభుత్వానికి, జిల్లా బ్యాంక్‌కు పంపడంలో నిర్లక్ష్యం వహించినట్లు గుర్తించారు. ఇందుకు బాధ్యులైన ఇరువురిపై చర్యలు తీసుకోవాలని జిల్లా సహకార అధికారి చైర్మన్‌ను ఆదేశించడంతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి కార్యదర్శి హుస్సేన్, కంప్యూటర్ ఆపరేటర్ వెంకటేశ్వర్లును సస్పెండ్‌చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో చైర్మన్ నలజాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ సుభాష్‌రెడ్డి, డైరెక్టర్లు గుగులోతు రవి, సైదా, మంగమ్మ, అన్నెం రవీందర్‌రెడ్డి, పల్లపు సుదర్శన్, మండాది శ్రీను పాల్గొన్నారు.

సాగర్‌కు కొనసాగుతున్న వరద

● రెండు గేట్ల ద్వారా నీటి విడుదల ● పూర్తిస్థాయి నీటిమట్టానికి మూసీ జలాశయం ● పులిచింతల నుంచి దిగువకు కొనసాగుతున్న కృష్ణమ్మ పరవళ్లు

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, సెప్టెంబరు17: నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక కొనసాగుతుండటంతో రెండు క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి 67,871 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు) కాగా, మంగళవారం సాయంత్రానికి 589.90 అడుగులుగా(311.7462టీఎంసీలు) నమోదైంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ, కుడి, ఎడమకాల్వలకు, 2గేట్ల నుంచి మొత్తం 70,629 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నెల 11వ తేదీన మొత్తం 11గేట్లు మూసివేయగా, 12వ తేదీన 10గేట్లు ఎత్తి అదే రోజు రాత్రి అన్నీ గేట్లు మూసేశారు. 13వ తేదీన 2గేట్లు ఎత్తగా, 14న మరో 2గేట్లు ఎత్తి మొత్తం 4 నాలుగు గేట్ల నుంచి నీటి విడుదల చేశారు. ఆదివారం నాలుగు గేట్ల నుంచి నీటి విడుదలను కొనసాగించగా, సోమవారం రెండు గేట్లు మూసివేసి రెండు గేట్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేశారు. మంగళవారం రెండు గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగించారు.


సాగర్ ప్రాజెక్ట్ నుంచి రెండు గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

మూసీకి 382.28క్యూసెక్కుల వరద

నల్లగొండ, సూర్యాపేట జిల్లాల పరిధిలో ఉన్న మూసీ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 645అడుగులు(4.46టీఎంసీలు) కాగా, మంగళవారం సాయంత్రానికి 644అడుగులుగా(4.20టీఎంసీలు) నమోదైంది. ఎగువనుంచి 382.28క్యూసెక్కుల వరద వస్తుండగా, కాల్వలకు 629.46క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రెండు గేట్ల ద్వారా పులిచింతల నీరు..

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతుండగా.. రెండు గేట్లు నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 175 అడుగులు (45.77 టీఎంసీలు) కాగా, మంగళవారం సాయంత్రానికి 174.17 అడుగులుగా(44.4 టీఎంసీలు) నమోదైంది. ఎగువ నుంచి 51,030 క్యూసెక్కుల వరద వస్తుండగా, రెండు గేట్ల నుంచి 35,030 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం నుంచి 16వేల క్యూసెక్కులు మొత్తంగా 51,030 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నెల 11వ తేదీన మొత్తం 24గేట్లను మూసివేగా, 12న మూడు గేట్లను ఎత్తారు. 13న రెండు గేట్లు మూసి ఒక గేటు నుంచి నీటి విడుదల చేశారు. 14వ తేదీన మరో రెండు గేట్లు ఎత్తి మూడు గేట్ల నుంచి, ఆదివారం ఒక గేటు మూసి రెండు గేట్ల నుంచి విడుదల చేశారు. సోమవారం రెండు గేట్ల నుంచి నీటి విడుదల చేయగా, మంగళవారం దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది.

ఎమ్మెల్యే సంజయ్‌గైక్వాడ్‌పై చర్యలు తీసుకోవాలి

● రాహుల్‌గాంధీపై వివాదాస్పద వ్యాఖ్యలు సరికాదు ● భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి


శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌లో సంజయ్ గైక్వాడ్‌పై ఫిర్యాదు చేస్తున్న కిరణ్ కుమార్‌రెడ్డి, వీహెచ్

శాలిగౌరారం, సెప్టెంబరు 17: శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్‌పై చర్యలు తీసుకోవాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు ఆయన నల్లగొండ జిల్లా శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై మహారాష్ట్ర సీఎం షిండే వర్గానికి చెందిన సంజయ్ గైక్వాడ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా ఉన్నందున అతనిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ నాలుక కోసిన వారికి రూ.11లక్షలు బహుమతి ఇస్తానని ప్రకటించడం ఎంత వరకు సమంజసమన్నారు. ఈ ద్వేషపూరిత వ్యాఖ్యలు సమాజంలో దుష్ప్రవర్తనను ప్రోత్సహించే విధంగా ఉన్నాయన్నారు. ఈ వ్యాఖ్యలు రాహుల్ గాంధీని చంపేందుకు కాంట్రాక్ట్(సుపారీ) ఇవ్వడం తప్ప మరొకటి కాదన్నారు. దేశ సమగ్రతకు భంగం కలిగించే ఈ వ్యాఖ్యలపై ఎఫ్ఐఆర్ నమోదుచేసి ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని శాలిగౌరారం సీఐ కొండల్ రెడ్డి, ఎస్ఐ డి.సైదులుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు హనుమంతరావు, ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం కూడా ఫిర్యాదులో సంతకాలు చేశారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

మేళ్లచెర్వు, సెప్టెంబరు 17: సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రంలో ఒక కుటుంబానికి చెందిన ముగ్గురిపై దాడి కేసు నమోదైంది. ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఉప్పతల అయోధ్య, సాతునూరి మాధవరావు, ఒకే వీధిలో ఎదురెదురుగా ఉంటున్నారు. ఈ రెండు కుటుంబాల మధ్య మురుగుకాల్వ విషయంలో గతంలో అనేక గొడవలు జరిగాయి. కాగా మంగళవారం ఉదయం అయోధ్య అతని భార్య వారి ఇంటి ఆవరణలో ఉండగా.. సాతునూరి సురేష్ వారిని ఫొటోలు తీశారని, అదేమిటని అడగగా సాతునూరి సురేష్, సాతునూరి మాధవరావు సాతునూరి లక్ష్మీలు అయోధ్య, అయోధ్య భార్యపై దాడి చేశారని అయోధ్య భార్య రంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి అరెస్ట్

దేవరకొండ, సెప్టెంబరు 17: నల్లగొండ జిల్లా దేవరకొండలో వినాయక నిమజ్జన శోభాయాత్రలో ఈ నెల 16న మద్యం మత్తులో బూషరాజు సంతోష్ అనే యువకుడు పులిజాల శంకర్‌పై కత్తితో దాడి చేసిన ఘటనలో సంతోష్‌ను అరెస్ట్ చేసి మంగళవారం కోర్టుకు రిమాండ్ పంపినట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. గణేష్ శోభాయాత్రలో మద్యం మత్తులో ఉన్న సంతోష్ బొడ్రాయిబజార్‌కు చెందిన శంకర్‌తో గొడవపడ్డాడు. మత్తులో నిమ్మకాయలు కోసే కత్తితో సంతోష్ శంకర్‌ను గాయపరచగా, స్వల్పంగా గాయాలుకాగా దేవరకొండ ఆస్పత్రిలో చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. శంకర్ తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు సంతోష్‌ను కోర్టుకు రిమాండ్‌కు పంపినట్లు సీఐ చెప్పారు.

గణేష్ నిమజ్జనోత్సవంలో అపశ్రుతి

● చెరువులో పడి యువకుడి మృతి ● యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలో విషాదం

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 17: అప్పటివరకు ఆనందోత్సాహాలతో సాగిన గణేష్ నిమజ్జనోత్సవంలో చిన్న ఏమరపాటు కారణంగా ఓ యువకుడు చెరువులో పడి మృత్యువాతపడ్డాడు. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జిబ్లక్‌పల్లి గ్రామం ముష్టోన్‌బాయి కాలనీకి చెందిన పబ్బతి మల్లయ్య కూలి పని చేస్తూ జీవనం సాగిస్తుండగా, కుమారుడు ప్రవీణ్, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహంకాగా, కుమారుడు ప్రవీణ్ (27) బీటెక్ పూర్తిచేసి హైదరాబాద్‌లో ఉంటున్న బావ వద్ద సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. వినాయక చవితి పండుగ నిమిత్తం ఈ నెల 14వ తేదీన స్వగ్రామం చేరుకుని ఇంటివద్ద ఏర్పాటుచేసిన వినాయక చవితి ఉత్సవాల్లో పాల్గొన్నాడు. మంగళవారం ఉదయం గ్రామంలో నిర్వహించిన గణేష్ నిమజ్జనోత్సవానికి తన స్నేహితులతో కలిసి ఊర చెరువుకు వెళ్లాడు. చెరువులో జారి పడి నీటిలో మునిగిపోయాడు. కొద్దిసేపటికి ప్రవీణ్ లేడనే విషయాన్ని గమనించిన స్నేహితులు చెరువులో గాలించారు. ఉపాధి పనుల్లో భాగంగా చెరువులో ఇటీవల తవ్విన పెద్ద గుంతలో ఇరుక్కోవడంతో 15నిమిషాల అనంతరం ఒడ్డుకు తీసుకువచ్చారు. ప్రాథమిక చికిత్స చేసేందుకు ప్రయత్నిస్తుండగా అప్పటికే మృతి చెందాడని గుర్తించారు. చెరువులో మునిగినా ఈత రాకపోవడంతో గుంతలో ఇరుక్కుపోవడంతో ఊపిరాడక మృతిచెందడంతో స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.


రోదిస్తున్న కుటుంబ సభ్యులు, (ఇన్‌సెట్‌లో) ప్రవీణ్(ఫైల్)

శిశువు మృతిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 17: వైద్యుల నిర్లక్ష్యం తోనే తమ శిశువు మృతి చెందిందని సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం గుర్రంపోడు తండాకు చెందిన బాసిపాకుల రేణుక, నాగరాజు ఆరోపించారు. మంగళవారం జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 15 ఆదివారం తన భార్య రేణుక పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో డెలివరి కోసం అడ్మిట్ అయిందని నాగరాజు అన్నారు. కాగా డ్యూటీ డాక్టర్ లేకపోవడం, నర్సుల నిర్లక్ష్యంతో నార్మల్ డెలివరీ అయినప్పటికి తమ శిశువు చనిపోయిందన్నారు. డ్యూటీలో ఉన్న డాక్టర్లు, నర్సులు కాన్పు సమయంలో తన భార్యను అసభ్యంగా దూషించి చేయి చేసుకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా డెలివరీ సమయంలో పాప నార్మల్‌గానే ఉందని, శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉంటే సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి మూడు రోజుల క్రితమే పంపించామని ఆసుపత్రి ఇన్‌చార్జి తెలిపారు. డ్యూటీ డాక్టర్లు, నర్సుల తప్పు ఏమీ లేదన్నారు. గర్భిణీపై ఎవరు దాడి చేయలేదన్నారు.

భూమిని పట్టా చేయడం లేదని చంపేశాడు

● తండ్రిని హతమార్చిన తనయుడు ● తల్లీకుమారుల పరార్

కేతేపల్లి, సెప్టెంబరు 17: భూమిని తన పేరిట పట్టా చేయడంలేదనే ఆగ్రహంతో తనయుడు తండ్రిని హతమార్చాడు. మంగళవారం రాత్రి నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని చెరుకుపల్లి గ్రామంలో ఈ ఘటన జరిగింది. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. చెరుకుపల్లి గ్రామానికి చెందిన పిట్టల సైదులు(45) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తనకున్న మూడు ఎకరాలకు తోడు మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు. సైదులుకు భార్య ప్రమీల, కుమారుడు నవీన్, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం చేయగా, కుమారుడు నవీన్ ఇంటి వద్దే ఉంటూ తండ్రికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో కొద్దికాలంగా భార్యాభర్తల మధ్య వివాదాలు నెలకొన్నాయి. ఇదే సమయంలో తండ్రి సైదులు పేరిట ఉన్న మూడు ఎకరాల భూమిని తన పేరిట పట్టా చేయించమంటూ కుమారుడు నవీన్ తరచూ గొడవపడుతున్నాడు. ఈ విషయంలో సైదులు భార్య ప్రమీల సైతం కుమారుడు నవీన్‌కు మద్దతుగా ఉంటోంది. ఇదే విషయమై మంగళవారం మరోసారి ఇరువురి మధ్య గొడవ జరగడంతో ఆవేశంలో నవీన్.. తండ్రి సైదులు తలపై రోకలి బండతో మోదాడు. దీంతో సైదులు తలపగిలి రక్తపు మడుగులో పడి మృతిచెందాడు. ఇది గమనించిన తల్లీ కుమారులు ఇంటినుంచి పరారయ్యారు. ఇంట్లో జరిగిన గొడవను గమనించిన స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సైదులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని కేతేపల్లి ఎస్ఐ శివతేజ వివరించారు.

దొంగకు దేహశుద్ధి చేసి...

పులిహోర తినిపించారు

● నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో ఘటన

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 17: ఓఆలయంలో చోరీకి యత్నించిన యువకుడిని పట్టుకున్న యువకులు దేహశుద్ధి చేసి స్తంభానికి కట్టేశారు.. అనంతరం ఆకలి వేస్తుందని చెప్పటంతో పులిహోర తినిపించి తండ్రికి అప్పజెప్పారు. సోమవారం రాత్రి నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెంలో ఈ సంఘటన జరిగింది. ఈ ఆసక్తికర సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావటంతో విషయం వెలుగుచూసింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన పోగుల గణేష్ ఆంజనేయస్వామి ఆలయం తలుపులకు వేసిన తాళాన్ని పగులగొట్టే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో హుండీలోని డబ్బులను చోరీ చేసేందుకు యత్నించాడు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయకుడి మండపంలో మెలకువతోనే ఉన్న యువకులు అలికిడి విని వెళ్లి గణేష్‌ను పట్టుకుని స్తంభానికి కట్టేశారు. అర్ధరాత్రి సమయంలో ఇక్కడ ఏంచేస్తున్నావు, తాళం ఎందుకు పగులగొడుతున్నావని కొందరు యువకులు అతడికి దేహశుద్ధి చేశారు. దీంతో అతడి పెదవులు చిట్లాయి. తాను ఇంతకుముందే నాలుగు పర్యాయాలు చోరీ చేశానని, తనపై కేసులు ఉన్నాయని వివరించాడు. రెండు గంటల పాటు స్తంభానికి కట్టి ఉంచారు. తన వివరాలు చెప్పి, తనకు ఆకలిగా ఉందని చెప్పడంతో వినాయకుడి మండపంలోని పులిహోరను గణేష్‌కు తినిపించారు. తెల్లవారుజామున ఆ యువకుడిని తండ్రికి అప్పజెప్పారు.


ఆకలిగా ఉందని చెప్పడంతో పులిహోర తినిపిస్తున్న యువకుడు

పట్టుబడిన గంజాయి విక్రేత

భువనగిరి టౌన్, సెప్టెంబర్ 17: జిల్లాకేంద్రం భువనగిరి పట్టణంలో గంజాయి విక్రయిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ డీటీఎఫ్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసులు మంగళవారం దాడులు చేశారు. ఈమేరకు తాపీ పనులు చేస్తూ స్థానిక జంఖానాగూడలో అద్దె ఇంట్లో నివాసముంటున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన జహీర్‌షేక్ వద్ద విక్రయానికి సిద్ధంగా ఉంచిన 100 గ్రాముల గంజాయి పట్టుబడింది. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకొని, గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్ సైదులు తెలిపారు.


పోలీసులు అదుపులో నిందితుడు

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలు

ఆలేరు రూరల్, సెప్టెంబరు 17: రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో ఈ ఘటన మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. రాజాపేట మండలం పాముకుంట గ్రామానికి చెందిన బింగి శ్రీను ప్రస్తుతం హైదరాబాద్ ఉప్పల్‌లో నివాసముంటున్నారు. మంగళవారం పని నిమిత్తం హైదరాబాద్ నుంచి ఆటోలో ఆలేరుకు వస్తుండగా ఆలేరు పెద్ద మసీద్ వద్దకు రాగానే వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఖాళీ ఇండేన్ గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శ్రీను తలకు తీవ్రగాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఈవిషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రజినికర్ తెలిపారు.


ధ్వంసమైన వాహనాలు, (ఇన్‌సెట్‌లో) గాయాలపాలైన ఆటో డ్రైవర్

పైన వాటర్ బాటిళ్లు.. లోపల లేగదూడలు

● వాటర్ బాటిల్ రవాణా పేరుతో లేగదూడల తరలింపు ● పట్టుకున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ కార్యకర్తలు ● పోలీసులకు అప్పగింత.. కేసు నమోదు




లేగదూడలు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 17: మినీ వాహనంలో వాటర్ బాటిళ్ల పేరుతో లేగదూడలను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాన్ని మంగళవారం పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని జంగాలకాలనీలో కొనుగోలు చేసిన దూడలను అక్రమంగా తరలిస్తుండగా వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ కార్యకర్తలు, బీజేపీ నాయకులు పట్టుకున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంతంలో నెంబర్ ప్లేట్‌లేని మినీ వాహనంలో లేగదూడలు తరలిస్తున్నారు. అయితే వాహనంలో లోపల లేగదూడలు బయటకు కన్పించకుండా పైన వాటర్ బాటిళ్ల బస్తాలను వేశారు. వాహనం కోదాడ వైపు వెళుతుండగా.. కోదాడ రోడ్డు మూలమలుపు వద్ద ఉన్న భజరంగ్‌దళ్ కార్యకర్తలకు మూగజీవాల అరుపులు వినిపించడంతో వెంటనే వాహనాన్ని ఆపారు. వాహనాన్ని తనిఖీ చేయగా, అందులో 10 లేగదూడలు కన్పించాయి. భజరంగదళ్ కార్యకర్తలు వెంటనే బీజేపీ నాయకులకు సమాచారం అందించగా, వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ముత్తయ్య ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనాన్ని మునిసిపల్ కార్యాలయానికి తరలించారు. లేగ దూడలను మునిసిపల్ కార్యాలయంలో కట్టివేశారు. కాగా ఎస్ఐ ముత్తయ్య, పశువైద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డిని పిలిపించి, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం లేగ దూడలను హైదరాబాద్ జియాగూడలోకి శ్రీసమృత కామధేను గోశాలకు తరలించారు. భజరంగదళ్, బీజేపీ, వీహెచ్‌పీ కార్యకర్తల నుంచి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

ఓజోన్ పొరను కాపాడుకోవాలి

ఆలేరు రూరల్, సెప్టెంబరు 17: ప్రకృతి సంపదలను కాపాడుకోకపోతే పర్యావరణ సమతుల్యత దెబ్బతిని, ఓజోన్ పొరకు తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉందని ప్రధానోపాధ్యాయురాలు దాసరి మంజుల అన్నారు. మంగళవారం ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎన్‌సీసీ ఆధ్వర్యంలో వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో దూడల వెంకటేష్, డాక్టర్ పోరెడ్డి రంగయ్య, సైదులు ఉన్నారు.

'లైసెన్సులు లేనివారిపై చర్యలు తీసుకోవాలి'

ఆలేరు రూరల్, సెప్టెంబరు 17: ఎలాంటి లైసెన్సులు లేకుండా గీత వృత్తిని దెబ్బతీసే విధంగా కల్లుగీస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గౌడ జన హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుండ్లపల్లి వెంకటేష్‌గౌడ్ కోరారు. మంగళవారం స్థానిక ఎక్సైజ్ సీఐ దీపికకు వినతిపత్రాన్ని అందజేశారు. తమకు జీవనాధారమైన వృత్తిని అనర్హులు చేపట్టడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు దూడల సిద్దయ్య, లచ్చయ్య, వీరస్వామి, ఉప్పలయ్య, భిక్షపతి లింగయ్య ఉన్నారు.

'అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి'

భువనగిరి టౌన్, సెప్టెంబరు 17: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు-2024లో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మిరియాల దామోదర్ అన్నారు. మంగళవారం భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విదేశాల్లో ఉన్న ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు లభించాయని, మరికొందరు గడువు ముగిసినా నేటికీ విధుల్లో చేరలేదని అన్నారు. ఈ ఉదంతంలో యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన జరిగిందన్నారు. ఇందుకు కారకులైన అధికారులు, ఉపాధ్యాయులను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ముకెక్కర్ల యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తోడ్పాటునందించాలి

భువనగిరి రూరల్, సెప్టెంబరు 17: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతీ ఒక్కరు తోడ్పాటునందించాలని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బూర్గు మణికంఠ గౌడ్ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకుని మంగళవారం మండలంలోని హన్మాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు మెటీరియల్ అందజేశారు. బీజేపీ నాయకులు పన్నాల అనంతరెడ్డి, ఎస్ ఉపేందర్, పి వెంకటేశ్, జ్ఞానేశ్వర్, నాగరాజు, కొండల్, ప్రవీణ్, శ్రీరాం ఉన్నారు.

సంక్షిప్తంగా..

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఈ నెల 19వ తేదీన విద్యార్థులకు మండల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో శ్రీధర్, హైస్కూల్ హెచ్‌ఎం కె.మహదేవ రెడ్డి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ బాలబాలికల అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్, లతోపాటు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులు పుట్టిన తేదీ సర్టిఫికెట్, బోనఫైడ్, ఆధారు కార్డులను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

అడ్డగూడూరు: జాతీయ మానవ హక్కులు, సామాజిక న్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా అడ్డగూడూరు మండలంలోని చౌళ్లరామారం గ్రామానికి చెందిన తోట నవీన్ ఎన్నికయ్యారు. ఈ మేరకు జాతీయ రాష్ట్ర అధ్యక్షుడు దానియేలు ఉత్తర్వులు జారీ చేశారు.

మోత్కూరు : మండలంలోని రాగిబావి గ్రామంలో శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయ విస్తరణకు పురోహితుడు భాస్కరభట్ల శివానందశర్మ సువర్చలా సహిత భక్తాంజనేయస్వామికి సింధూర పూజ నిర్వహించారు. అనంతరం ఆలయ విస్తరణకు విరాళాల సేకరణ ప్రారంభించారు.

మోత్కూరు : మోత్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పల్లెర్ల వెంకన్న తన సోదరుడు పల్లెర్ల వీరయ్య జ్ఞాపకార్థం మంగళవారం రూ.31 వేల విలువ కల్గిన కుర్చీలు అంజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమంత్‌కుమార్ దాత వెంకన్నను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ అమరావతి, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

● మోత్కూరు రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.65 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన వాణిజ్య సముదాయం, గోదాంను ఈ నెల 19న ఉదయం స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించనున్నారని ఆ సంఘం చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు తెలిపారు. సంఘం పాలక వర్గ సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

చౌటుప్పల్ టౌన్ : చౌటుప్పల్ మునిసిపాలిటీలో పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు కోరారు. మునిసిపాలిటీలో పక్షం రోజుల పాటు నిర్వహించే స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని మంగళవారం చైర్మన్ రాజు ప్రారంభించారు. స్వచ్ఛత హి సేవా - 2024పై చైర్మన్ రాజు ప్రతిజ్ఞ చేయించిన అనంతరం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మునిసిపల్ కమిషనర్ కె. నర్సింహ్మా రెడ్డి, వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, డిప్యూటీ డీఈఈ రాములు, కౌన్సిలర్లు ఎండీ.బాబాషరీఫ్, కె.సైదులు, బి.బాలకృష్ణ, కె. శైలజా, విజయ, రాజ్యలక్ష్మి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుర్వి నర్సింహ్మా, బి.మురళి, మునిసిపల్ మేనేజర్ పి.లింగయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, రేణుకుమార్ పాల్గొన్నారు.

వలిగొండ: మండల కేంద్రంలో విశ్వకర్మ జయంతి వేడుకలను విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పుష్పగుచ్ఛాలు వేసి పూజలు నిర్వహించారు. సంఘం పట్టణ అధ్యక్షుడు వెల్లంకి మురళి, అర్చకులు సుంకోజు అంజయ్యాచారి, గౌరవ సభ్యులు సీలోజు వెంకటేశం, ములుపోజు చంద్రమౌళి, పాలోజు చంద్రయ్య, పులిమామిడి రాజు, బాలకృష్ణ పాల్గొన్నారు.

వలిగొండ: మండలంలోని గొల్నేపల్లి గ్రామంలో ఆస్టియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రోలోగి యురాలజి, ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారుల 400 మంది రోగులు వైద్య సేవలు పొందారు. వారిక ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ క్యాంపు కనతల అశోక్‌రెడ్డి, నూతి చలపాతి, ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమంలో డాక్టర్లు గౌతమ్, జార్జిమూలార్, గౌతమ్‌కుమార్, సందీప్ ఎకుమార్, హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్ జీకే రాజు తదితరులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని హస్తినాపురం కాలనీకి చెందిన ఆశా కార్యకర్త కొంత కాలంగా కిడ్నీల సమస్యతో అనారోగ్యం బారిన పడింది. ఆమెను పరామర్శించిన భూదాన్‌పోచంపల్లి పీహెచ్‌సీకి చెందిన ఆశా కార్యకర్తలు ఆమెకు మనోధైర్యాన్ని చెప్పి తమవంతుగా రూ. 10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని పద్మశాలి చేనేత కార్మిక సంఘం నూతన కార్యవర్గం ఎన్నికల్లో అంకం పాండుతోపాటు ఆయన ప్యానల్ సభ్యులు మంగళవారం పట్టణంలోని మద్దెలమ్మదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం నూతన అధ్యక్షుడు సూరపల్లి రాము, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, సభ్యులు భారత భూషణ్, బిట్ల గణేష్, రుద్ర సూర్యప్రకాష్, గుర్రం హేమలత, ఆలయ ఉపాధ్యక్షుడు చింతకింది దామోదర్, ప్రధాన కార్యదర్శి కడవేరు రమేష్, కోశాధికారి తడక వెంకటేష్, సభ్యులు వనం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజాపేట: మండల కేంద్రంలోని మంటిస్సోరి పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యమంలో పాఠశాల కరస్పాండెంట్ దశరథ, ప్రిన్సిపాల్ లలితదేవి, ఉపాధ్యాయులు సిద్ధులు, నగేష్, రాజేశ్వరి, రంజన పాల్గొన్నారు.

రాజాపేట: నిధులు మంజూరు చేయాలని రాజాపేట ఎంపీడీవో నాగవేణికి మండల కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. గ్రామపంచాయతీల్లో నిధులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురొకుంటున్నామని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శుల జమీల్, శ్రీనివాస్, రాజామహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: సంక్షేమ వసతి గృహాల నిర్వహణను ప్రభుత్వం విస్మరిస్తున్నదని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ (టిఎస్ఎస్ఏ) వ్యవస్థాపక అధ్యక్షుడు మహేష్‌కుమార్ అన్నారు. భువనగిరిలో జరిగిన సమావేశంలో మాట్లాడారు.

సాయుధ వీరుల త్యాగం మరువలేనిది

● ప్రజా పాలన దినోత్సవంలో ప్రభుత్వ విప్ అయిలయ్య

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పరంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. బీజేపీ నేతలు విమోచన దినోత్సవం పేరిట పలుచోట్ల జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.



ఆలేరులో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్: నాటి అమరవీరుల త్యాగం మరువలేనిదని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. వెట్టి చాకిరీకి, దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఎంతో మంది వీరులు నేలకొరిగారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆలేరులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో, అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేసి అమరవీరులకు నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రజినికర్ తదితరులు జాతీయ జెండాను ఎగురవేశారు. సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్, చెక్క వెంకటేష్, దూపటి వెంకటేష్, పద్మావెంకటస్వామి ఉన్నారు.

● భువనగిరి పట్టణంలో నిర్వహించిన కార్యక్రమాల్లో మునిసిపల్



భువనగిరిలో జెండాను ఆవిష్కరిస్తున్న మునిసిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ పి.రామాంజల్‌రెడ్డి పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు పాశం భాస్కర్, మునిసిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, నాయకులు నర్ల నర్సింహరావు, చందా మహేందర్ గుప్తా, జన్నెపల్లి శ్యాంసుందర్ రెడ్డి, పట్నం శ్రీనివాస్ పాల్గొన్నారు. బాలసదనంలో నిర్వహించిన వేడుకల్లో సీడబ్ల్యూసీ చైర్మన్ బండారు జయశ్రీ పాల్గొన్నారు.

● భువనగిరిలో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏపీవో ఎన్.శోభారాణి జాతీయ జెండాను ఆవిష్కరించి మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, ఎంపీవో దినకర్, ఏపీవో బాలస్వామి, సంతోష్ తదితరులున్నారు.

● బీబీనగలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ తహసీల్దార్ శ్రీధర్ జాతీయ జెండాలను ఎగురవేశారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవంలో పార్టీ నాయకులు గోళి పింగల్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ఇంజమూరి ప్రభాకర్, నాయకులు లక్ష్మారెడ్డి, గోపాల్ రెడ్డి, వంశీగౌడ్, సదానందగౌడ్ పాల్గొన్నారు.



యాదగిరిగుట్టలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

● తుర్కపల్లి మండలంలో నిర్వహించిన కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఐనాల చైతన్యమహేందర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ దానావతు శంకర్‌నాయక్, నాయకులు సుంకరి శెట్టయ్య, ధనావతు భాస్కర్‌నాయక్, మాజీ ఎంపీటీసీ మోహన్‌బాబు, భూక్య రాజారాంనాయక్, సోమల్ల వెంకటేశ్, ఆలేరు ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు నిఖిల్‌గౌడ్ తదిరులు పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆకుల సైదులు, రమేష్, మేకల శ్రీనివాస్, చలమయ్య, మండల నాయకులు జక్కుల వెంకటేష్, కొక్కొండ లక్ష్మీనారాయణ, చిలుకూరి రమేశ్, రాము, కందుకూరి వేణు, బానోతు శ్రీకాంత్, మోహన్‌నాయక్ పాల్గొన్నారు.

● గుండాల మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్యామ్యూల్, తహసీల్దార్ జలకుమారి, ఎస్ఐ సైదులు, వెటర్నరీ డాక్టర్లు ప్రత్యూష, యాకుబ్, మండల వైద్యాధికారి హైమావతి, కస్తూర్బా పాఠశాల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రాము, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● మోత్కూరు మండల కేంద్రంతో పాటు, మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ప్రజా పాలన దినోత్సవం నిర్వహించారు. మునిసిపల్ చైర్ పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి, మండల ప్రత్యేక అధికారి పి.యాదయ్య, తహసీల్దార్ డి.రాంప్రసాద్, సింగిల్‌విండో చైర్మన్ పేల



తుర్కపల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

పూడి వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి వారివారి కార్యాలయాల ఎదుట జాతీయ జెండాలు ఎగుర వేశారు. కార్యక్రమాల్లో మునిసిపల్ వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, మునిసిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్, ఎంపీడీవో ఎండి.నిరంజన్ పాల్గొన్నారు.

● బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పోచం సోమయ్య, నాయకులు గౌరు శ్రీనివాస్, జక్క మోహన్ రెడ్డి, చేకూరి మల్లేశం, ముత్తినేని తిరుమలేష్, కందుకూరి ప్రకాష్, సజ్జనం మనోహర్, చంద్రమౌళి, రమణ పాల్గొన్నారు.

● అడ్డగూడూరు మండలంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎంపీడీవో శంకరయ్య, తహసీల్దార్ శేషగిరిరావు, ఎస్ఐ నాగరాజు, మండల వైద్యాధికారి ప్రవీణ్ కూమార్, సింగిల్ విండో చైర్మన్ కొప్పుల నిరంజన్ రెడ్డి, వైస్ చైర్మన్ చేడే చంద్రయ్య పాల్గొన్నారు.

● ఆత్మకూరు(ఎం) మండలంలో నిర్వహించిన కార్యక్రమాల్లో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో రాములు నాయక్, డాక్టర్ వంశీకృష్ణ, డీటీ సఫీయొద్దీన్, హెచ్‌ఎం, మాజీ ఎంపీపీ తండ మంగమ్మ, ఆర్ఐ మల్లికార్జున్‌రావు, మాజీ ఎంపీటీసీ ఎం.వెంకటేశం, మాజీ సర్పంచ్ జె.నగేష్, నాయకులు వై.లక్ష్మారెడ్డి, బి.ఇంద్రారెడ్డి, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

● మోటకొండూరులో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎంపీడీవో ఇందిర, తహసీల్దార్ శాంతిలాల్, ఎస్ఐ పాండు, మండల వైద్యాధికారి విజయ్, బీజేపీ మండల అధ్యక్షుడు తండ కృష్ణ, నాయకులు పీసరి తిరుమల్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు చిర్ర రవీందర్, అనంతుల పాండురంగరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఆలేటి నాగరాజు, ఉపాధ్యక్షుడు మల్లా అశోక్, కోశాధికారి బాల్ద నర్సింహులు పాల్గొన్నారు.

● వలిగొండలో నిర్వహించిన కార్యక్రమాల్లో మండల ప్రజాపరిషత్ ప్రత్యేక అధికారి జగన్నాథరావు, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎం జానీ, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ యుగేందర్, వ్యవసాయశాఖ అధికారి అంజనీదేవి, ఎంపీడీవో జితేందర్‌రెడ్డి, నాయకులు వాకిటి అనంతరెడ్డి, ఆర్ఐలు కరుణాకర్‌రెడ్డి, మనోహర్, రాధకుమార్ పాల్గొన్నారు.

● చౌటుప్పల్ పట్టణంలో నిర్వహించిన కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఆర్డీవో శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ హరికృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, ఏఎంసీ సెక్రటరి రవీందర్‌రెడ్డి, ఏవో నాగరాజు, ట్రాన్స్‌కో ఏఈ సతీష్, పాఠశాల ప్రిన్సిపాల్ సరోజనమ్మ, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ఆలివేలు, కాటం రాజు పాల్గొన్నారు.

● రామన్నపేటలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎంపీడీవో యాకూబ్ నాయక్, ఎంపీవో రహీముద్దీన్, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో వెంకన్న, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ రహత్‌ఖానం, డాక్టర్ ఎం.రవీందర్, డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, డాక్టర్ జేసీ.బాబు, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య రత్న మంజుల, ఎం.అనిత, డి.కిషన్, డాక్టర్ పి.బ్రహ్మం, డాక్టర్ రాచమల్ల శ్రీను పాల్గొన్నారు.

● యాదగిరిగుట్ట పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, భువనగిరి శ్యాంసుందర్, జెల్ల భానుచందర్, దొమ్మాట ప్రభాకర్, బొడ్డు సుజాత, మందోజి నరేష్, సుడుగు రాజిరెడ్డి, బొమ్మగాని రాజమణి, పలుగుల సురేష్ పాల్గొన్నారు.



మోత్కూరులో జెండాను ఆవిష్కరిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ కవిత

ప్రపంచం మెచ్చిన నేత ప్రధాని మోదీ

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్

భువనగిరి టౌన్, సెప్టెంబరు 17: ప్రపంచం మెచ్చిన నేత ప్రధాని నరేంద్రమోదీ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అన్నారు. మంగళవారం భువనగిరిలో నిర్వహించిన ప్రధాని జన్మదిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తోందని, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అన్నారు. జిల్లా ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ మాయ దశరథ, నాయకులు నర్ల నర్సింగ్‌రావు, పట్నం శ్రీనివాస్, జెన్నపల్లి శ్యాంసుందర్‌రెడ్డి, చందా మహేందర్ గుప్త, ఫకీర్ రాజేందర్‌రెడ్డి, ఎండీ.మహమూద్, ఎగదాని సంతోష్, పల్లెపాటి వేణుగోపాల్, నల్లమాస కకుమార్ పాల్గొన్నారు.



భువనగిరిలోని ఓ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్నబీజేపీ నాయులు

వలిగొండ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు ఏలే చంద్రశేఖర్, సీఎస్.రెడ్డి, జిల్లా సభ్యత్వ ప్రముఖ్, రాచకొండ కృష్ణా, జిల్లా కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి, సీనియర్ నాయకులు బందారపు లింగస్వామి, సీలోజు శ్రీరాములు, నాయకులు మైసోళ్ల మత్స్యగిరి, బచ్చు శ్రీనివాస్, మారోజు అనిల్‌కుమార్, లోడే లింగస్వామి, మందుల మంజుల, అంజమ్మ పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్: పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షంగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, పి.శ్రీధర్ బాబు, ఆలె నాగరాజు, ఆలె చిరంజీవి, బత్తుల జంగయ్య, బిక్షమాచారి, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అడ్డగూడూరు: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ననుబోతు సైదులు, నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ కూరాకుల వెంకన్న, ఉపాధ్యక్షుడు మారడు కుమారస్వామి, నాయకులు లింగాల శ్యామ్‌సుందర్ రెడ్డి, సోమిరెడ్డి నర్సిరెడ్డి, నవీణ్‌కూమార్ పాల్గొన్నారు.

అస్థిత్వాన్ని తాకట్టు పెట్టడం ఆక్షేపణీయం : బీఆర్ఎస్



తెలంగాణతల్లి ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 17: రాష్ట్ర సచివాలయం, అమరవీరుల మధ్య కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం తెలంగాణ అస్థిత్వాన్ని తాకట్టు పెట్టడం ఆక్షేపణీయమని పలువురు బీఆర్ఎస్ నేతలు అన్నారు. జిల్లాలోని పలుచోట్ల బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. యాదగిరిగుట్ట పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, నాయకులు మిట్ట వెంకటయ్య, రేపాక స్వామి, పేరబోయిన సత్యనారాయణ, చిత్తర్ల బాలయ్య, గడ్డం చంద్రం, దేవిపూజ అశోక్, బండ రామస్వామి, వాసం రమేష్, బండ సిద్దులు, నజీర్, కరుణాకర్, శ్రీనివాస్, అంకం నర్సింహా, దండబోయిన వీరేశం, ముక్కర్ల శ్రీశైలం, కుమార్ పాల్గొన్నారు.

మోత్కూరు: మోత్కూరు పాతబస్టాండులో బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మునిసిపాలిటీ అధ్యక్షుడు జంగ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బయ్యని పిచ్చయ్య, సింగిల్ విండో డైరెక్టర్లు పురుగుల మల్లయ్య, సామ పద్మారెడ్డి, నాయకులు కొండ సోంమల్లు, మర్రి అనిల్‌కుమార్, మంచె గోవర్ధన్, డాక్టర్ కోక బిక్షం, దబ్బెటి శైలజ, కట్ట ఇంద్రజ్యోతి, ఎ.విద్యాసాగర్, కల్వల శోభన్ పాల్గొన్నారు.

అడ్డగూడూరు: అడ్డగూడూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దర్శనాల అంజయ్య, బీఆర్ఎస్ మండల కార్యదర్శి చౌగోని సత్యంగౌడ్, మాజీ ఎంపీటీసీ పూలపెల్లి జనార్ధన్ రెడ్డి, చిన్నపడిశాల మాజీ సర్పంచ్ దబ్బేటి నర్సయ్య గౌడ్ పాల్గొన్నారు.

రాజాపేట: మండలంలోని బేగంపేట గ్రామంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, మాజీ జడ్పీటీసీ గోపాల్‌రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, హరినాథ్, భాస్కర్, సంతోష్, జశ్వంత్, బాగ్యమ్మ పాల్గొన్నారు.

చేవెళ్ల ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి



భీమా నాయక్‌ను సన్మానిస్తున్న స్థానిక నాయకులు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 17: గిరిజనుల అభివృద్ధి పేరిట కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన చేవెళ్ల ఎస్టీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని గుగులోతు భీమానాయక్ అన్నారు. మంగళవారం భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నా గిరిజనులకు ఇచ్చిన హామీలను నేటికీ నెరవేర్చలేదన్నారు. గిరిజనుల పట్ల ప్రభుత్వ వైఖరి మారకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామన్నారు. ఈ సందర్భంగా జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గ నూతన కమిటీలను ఆయన ప్రకటించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్య శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు నరసింహ, నియోజకవర్గ అధ్యక్షుడు కేతావత్ మురళి పాల్గొన్నారు.

కుల, మత, ప్రాంతీయ భేదాల ప్రసక్తే లేదు..

● సాయుధ పోరాటం స్ఫూర్తిదాయకం ● సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

భువనగిరి రూరల్/ వలిగొండ/ బీబీనగర్/ భువనగిరి అర్బన్, రాజాపేట, సెప్టెంబరు 17: కుల, మత ప్రాంతీయ భేదాల ప్రసక్తే లేని ఉద్యమమే సాయుధ రైతాంగ పోరాటమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ అన్నారు. మంగళవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలలో భాగంగా భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లిలోని రావినారాయణ రెడ్డి స్థూపం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. భూమి, భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం పేదలతో బందూకులు పట్టించి దొరలు, జాగీరుదార్లు, రజాకార్లకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు కులమతాలకతీతంగా పెద్ద ఎత్తున పోరాటం చేశారన్నారు. దేశంలో బీజేపీ విధానాలు ప్రజల మధ్యన ఐక్యతను దెబ్బతీస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కుట్రలు చేస్తోందన్నారు. రైతాంగ పోరాట అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, నాయకులు బట్టుపల్లి అనురాధ, దయ్యాల నర్సింహ, మాటూరి బాలరాజు, దాసరి పాండు, వెంకటేశ్, ముత్యాలు, రాజు, మల్లేశ్, ప్రకాశ్, యాదగిరి, మహేందర్, షరీఫ్ ఉన్నారు.



రేణికుంటలో రామ్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

● వలిగొండ మండలంలోని పులిగిల్ల, సుంకిశాల, పహిల్వాన్‌పురం, రెడ్లరేపాక గ్రామాల్లో నాటి పోరాట అమరవీరుల స్థూపాల వద్ద పూలమాలలు వేసి సీపీఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ మాట్లాడుతూ ఆనాడు ప్రజలను హింసించిన విసునూరు రామచంద్రారెడ్డి జన్నారెడ్డి ప్రతాప్‌రెడ్డి, విఠల్ రావు నైజాం ఎజెంట్లేనని అన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు, మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, డీవైఎఫ్ఐ గడ్డం వెంకటేశం, పీఎన్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి రాజు, సీపీఎం సీనియర్ నాయకులు కొమ్మిడి లక్ష్మారెడ్డి, తుర్కపల్లి సురేందర్, చీర్క శ్రీశైలంరెడ్డి, వాకిటి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

● బీబీనగర్ మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో సాయుధ పోరాట అమరవీరుల స్మారక స్థూపాల వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. నాయకులు చంద్రారెడ్డి, వెంకటేశ్, ముత్యాలు, రాజు, శ్రీనివాస్, భిక్షపతి, ఉమర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

● యాదగిరిగుట్ట మండలం కాచారంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుల స్మారక స్థూపాల వద్ద నివాళులు అర్పించారు. బబ్బూరి పోశెట్టి, గడ్డం వెంకటేష్, లవుడియా రాజు, వంటేరు పెంటారెడ్డి, నేలపట్ల శంకర్, ఇంజ లింగం, పబ్బోజు రాధమ్మ పాల్గొన్నారు.

● రాజాపేట మండలంలోని రేణికుంటలో తెలంగాణ సాయుధ పోరాటయోధుడు చింతలపూడి రామ్‌రెడ్డి విగ్రహానికి సీపీఎం, సీపీఐ నాయకులు వేర్వేరుగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మంగ ననర్సింహులు, కొల్లూరు రాజయ్య, బొరుగు భాగ్యమ్మ, చిగుర్ల లింగం, కటికల రామచంద్రం, హేమలత, అంజయ్య పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : చౌటుప్పల్ పట్టణంలోని కందాళ రంగారెడ్డి భవన్‌లో అమరవీరుల చిత్రపటాలకు మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండీ.పాషా, బూరుగు కృష్ణారెడ్డి, నాయకులు బండారు నర్సింహ, ఆకుల ధర్మయ్య, బత్తుల దాసు, ఎండీ.ఖయ్యూమ్ పాషా, నందీశ్వర్, బోయ యాదయ్య, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, కొంతం శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.



నాగిరెడ్డిపల్లిలో రావి నారాయణరెడ్డి స్మారక స్థూపం వద్ద మాట్లాడుతున్న జహంగీర్

మోత్కూరు : మండలంలోని పాటిమట్ల గ్రామంలో అమరవీరులు వనం విశ్వనాథం, కుర్మేటి ఎర్రమల్లయ్య, రాచకొండ రాజాలు స్మారక స్థూపాల వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, నాయకులు రాచకొండ కనకయ్య, కుర్మేటి యాదయ్య, దడిపల్లి ప్రభాకర్, అంజయ్య, యాదగిరి, చంద్రయ్య, సోమయ్య, సాంబయ్య, సాయిలు, రవి, రంగారెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

నాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చేసినది కమ్యూనిస్టులే

రామన్నపేట: మండల కేంద్రంలో బడుగు వెంకటయ్య స్థూపం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, నాయకులు ఎల్లంకి మహేందర్, ఊట్కూరి నర్సింహ, ఎర్ర రమేష్, శివరాత్రి సమ్మయ్య, బొలగాని మల్లయ్య, వెంకటయ్య, వీరమల్లు, ముత్తయ్య పాల్గొన్నారు.